## బీటీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

- మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేట, జనవరి 29: సిద్దిపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పలు బీటీ రోడ్ల మరమ్మతులకు రూ.5కోట్ల 13 లక్షల నిధులు మంజూరైనట్లు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల పలు రోడ్లు పాడైపోయి ప్రజల ప్రయాణానికి ఇబ్బందిగా మారాయన్నారు. నియోజకవర్గంలోని నారాయణరావుపేట, చిన్నకోడూరు మండలంలోని చిన్నకోడూరు చౌరస్తా వెళ్లే రహదారిలో చిన్నకోడూరు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి చౌడారం వరకు మూడున్నర కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ.కోటి 58లక్షలు, నారాయణరావుపేట మండలంలోని కోదండ రావుపల్లి నుంచి లక్ష్మీదేవిపల్లి ఎస్సీకాలనీ వరకు కిలోమీటరన్నర రోడ్డు మరమ్మతుకు రూ.66.30లక్షలు, నంగునూరు మండలంలోని అక్కెనపల్లి నుంచి కరీంనగర్ జిల్లా సరిహద్దు వరకు కిలోమీటరన్నర రోడ్డు మరమ్మతుకు రూ.59 లక్షలు, సిద్దిపేట అర్బన్ మండలంలోని బూరుగుపల్లి వడ్డెర కాలనీ నుంచి ఎన్సాన్‌పల్లి పంచాయతీ పరిధిలోని తిప్పర వేణి కాలనీ వరకు కిలోమీటరన్నరకు రూ.66.74 లక్షలు, సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్ నుంచి హాసన్‌మీరాపూర్ వరకు దాదాపు 4కిలోమీటర్లు రూ.కోటి 63 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశించారు.

## పంటలు ఎండకుండా సాగునీరు అందిస్తాం

మిరుదొడ్డి జాతరలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, జనవరి 29: యాసంగి సీజన్‌లో రైతులు వేసిన పంటలు ఎండకుండా సాగునీరు అందించడానికి కృషి చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మాఘ అమావాస్యను పురస్కరించుకొని బుధవారం మిరుదొడ్డితోపాటు అల్వాల గ్రామాల శివారులోని కూడవెల్లి వాగు వద్ద ఇరువైపులా జరుగుతున్న జాతరలో సీతారాముల స్వామి వారికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతోకలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. వేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ బాల్‌రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మల్లయ్య, అంజయ్య, దుర్గారెడ్డి, జ్ఞానేశ్వర్, మల్లేశం, లింగం, కుమార్, ఎల్లయ్య పాల్గొన్నారు. అనంతరం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రుద్రారంలో గొడ్డుబర్ల ఆంజనేయులకు రూ.55 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 29: కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండపాక మండలం గిరాయిపల్లికి చెందిన మైలారం సంతోష్ ప్రమాదవశాత్తు పొలంలో కరెంట్ షాక్ తగిలి మృతిచెందాడు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సహకారంతో వచ్చిన రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కులను వంటేరు ప్రతాప్‌రెడ్డి మృతుడి భార్య రాజేశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది ప్రజల పార్టీ అని కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడుతుందన్నారు. నియోజకవర్గంలో 97,500 సభ్యత్వాలు కలిగిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ఇప్పటి వరకు వివిధ కారణాలతో మృతిచెందిన 381మంది మృతుల కుటుంబాలకు రూ. 7.62కోట్లను అందజేశామన్నారు. కేసీఆర్ కార్యకర్తల సంక్షేమం కోసం బీమా పథకాన్ని ప్రవేశపెట్టారని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర నాయకుడు ప్రశాంత్, మండలాధ్యక్షుడు కుమార్, గిరాయిపల్లి మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, నాయకులు అహ్మద్, మల్లేశం, చంద్ర మౌళి, ప్రభాకర్ పాల్గొన్నారు.

## పరువు హత్యలపై చర్యలు తీసుకోండి

బక్కి వెంకటయ్య, కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ శంకర్

మిరుదొడ్డి, జనవరి 29: పరువు హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ (డీబీఎఫ్) కార్యదర్శి పెద్దలింగన్న గారి శంకర్ అన్నారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలను కలిసి పరువు హత్యలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట, రంగారెడ్డి జిల్లాలో ఇటీవల జరిగిన పరువు హత్యలకు కారణమైన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ బోర్డులో ప్రజాప్రతినిధుల జోక్యం తగదు

మాట్లాడుతున్న కలాల్ శ్రీనివాస్

సిద్దిపేట అర్బన్, జనవరి 29: భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రజాప్రతినిధుల జోక్యం తగదని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో బీఎంఎస్ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన డబ్బులను ప్రభుత్వం ఇతర ప్రయోజనాలకు ఖర్చు చేయడం సమంజసం కాదన్నారు. ప్రమాదవశాత్తూ కార్మికులు మరణించినా, అంగవైకల్యం చెందినా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల బీమా అందించాలన్నారు. భవన నిర్మాణాలు చేపడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి సెస్ వసూలు చేయడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. రాంరెడ్డి, సీటీ పాటిల్, సత్యనారాయణ, రాజిరెడ్డి, శంకర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

## ప్రజాపాలన అంటే మాట తప్పడమేనా?

మాట్లాడుతున్న దాచారం కనకయ్య

జగదేవపూర్, జనవరి 29: ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాట తప్పడం, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడమేనా అని బీఆర్ఎస్ నాయకుడు దాచారం కనకయ్య విమర్శించారు. బుధవారం జగదేవపూర్‌లో మాట్లాడుతూ సీఎం రేవంత్ ఇచ్చిన హామీలు అమలు చేయమంటే ఇదిగో ఇస్తం.. అదిగో ఇస్తమంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని 420 మాటలు చెప్పి, ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. మహిళలకు రూ. 2500, పెన్షన్ రూ.4వేలకు పెంపు, రైతు భరోసాకు వాయిదాల పర్వం, గృహలక్ష్మి గ్యాస్ పథకం డబ్బులు ఖాతాల్లో పడటం లేదని మహిళలు మండిపడుతున్నారన్నారు. కల్యాణలక్ష్మి ఎటుపాయే, తులం బంగారం ఏమాయే అంటు ఎద్దేవా చేశారు. సీఎం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ!

స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 29: మద్దూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. డీఈవోగా లిఖిత, డిప్యూటీ ఈవోగా అలేఖ్య, ఎంఈవోగా మనీషా, హెచ్ఎంగా శృతి, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులను హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

- మాఘ అమావాస్య సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు
- స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# జనసంద్రంగా కూడవెల్లి

దుబ్బాక: కూడవెల్లి రామలింగేశ్వరుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, కూడవెల్లి జాతరకు తండోపతండాలుగా తరలివస్తున్న భక్తజనం

దుబ్బాక, జనవరి 29: దక్షణ కాశీగా పేరొందిన కూడవెల్లి రామలింగేశ్వరాలయానికి మాఘ అమావాస్య సందర్భంగా బుధవారం భారీగా భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. జాతర ఏర్పాట్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యింది. జాతరకు వచ్చే భక్తుల వసతులపై అధికారులు, పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో సమస్యగా మారింది. కూడవెల్లి వాగులో నీరు లేకపోవడంతో భక్తులు స్నానాలు ఆచరించేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. మరోపక్క ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరైన క్యూలైన్లు ఏర్పాటు చేయకపోవడంతో సమస్యగా మారింది. ప్రత్యేక దర్శనం, సర్వ దర్శనం ఒకే చోట నుంచి కల్పించడంతో భక్తులు తోపులాటలతో ఇబ్బందులు పడ్డారు. మరోపక్క పోలీసులు అత్యుత్సాహం కనబరచడంతో భక్తులు మండిపడ్డారు. దర్శనం విషయంలో ఆలయ అధికారుల సూచనలను సైతం పోలీసులు పక్కన బెట్టారు. ఆలయంలో తొక్కిసలాటలతో పలువురు భక్తులు సొమ్మసిల్లి పడ్డారు. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోపక్క తాగునీటి కోసం భక్తులు అల్లాడిపోయారు. నాలుగు రోజుల పాటు ఆలయం వద్ద జాతర కొనసాగుతున్నందున, వసతుల లేమితో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

### వైభవంగా సింగరాయ జాతర

- పోటెత్తిన భక్తజనం
- కనువిందు చేసిన ప్రకృతి అందాలు

కోహెడ, జనవరి 29: మండలంలోని కూరెల్ల, తంగల్లపల్లి, గుండారెడ్డిపల్లి, బస్వాపూర్ గుట్టల్లో బుధవారం జరిగిన ప్రతాప రుద్ర సింగరాయ జాతర వైభవంగా జరిగింది. జాతరకు మూడుదార్లలో జనం పోటెత్తారు. వాహనాలు, కాలినడకన వచ్చిన భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు ఉదయం 4గంటల నుంచే వచ్చి తూర్పు నుంచి పడమరకు ప్రవహించే వాగులో స్నానాలు ఆచరించి గుట్టపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు. కనువిందు చేసిన ప్రకృతి అందాల మధ్య భక్తులు చెట్ల కింద వంటలు చేసుకొని కుటుంబసభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. పిల్లాపాపలతో వచ్చిన భక్తులకు ఆలయం వద్ద క్యూలైన్లో ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాగులో స్నానం చేస్తే సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని, చర్మవ్యాధులు పోతాయని భక్తుల నమ్మకం. జాతర ఏర్పాట్లను హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్‌కుమార్, ఆర్డీవో రామ్మోహన్, డీపీవో దేవకీదేవి, తహసీల్దార్ సుధేఖ పర్యవేక్షించారు.

### జాతరలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు

హుస్నాబాద్, జనవరి 29: కోహెడ మండలం కూరెల్ల, తంగళ్లపల్లి గ్రామాల శివారులో బుధవారం జరిగిన సింగరాయ లక్ష్మీనర్సింహస్వామి జాతరలో హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలందించారు. ఒక్కరోజు జరిగే ఈ జాతరకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరాగా, ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా వలంటీర్లు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ నయనాదేవి, అధ్యాపకులు కుమారస్వామి, బాలరాజు, సబీఫాతిమా, విజయ, అనిత, రాజ్యలక్ష్మి, పరశురాములు, శ్రీనివాస్, రమేశ్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కోహెడ: సింగరాయకొండ జాతరకు వచ్చిన భక్తులు

కోహెడ: స్వామివారి దర్శనానికి తరలివస్తున్న భక్తులు

### కూడవెల్లి ఆలయంపై నిర్లక్ష్య ధోరణి

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

మాఘ అమావాస్య సందర్భంగా బుధవారం మధ్యాహ్నం కూడవెల్లి రామలింగేశ్వరున్ని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం, వాగు సమీప ప్రాంతాల్లో భక్తులు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాఘ అమావాస్య అంటే కూడవెల్లిగా పేరొందిందని, పదేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆలయంలో సకల వసతులు కల్పించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడవెల్లి జాతరపై నిర్లక్ష్యధోరణి కనబరిచిందని మండిపడ్డారు. మల్లన్నసాగర్‌లో పుష్కలంగా నీరున్నా కూడవెల్లి వాగులోకి నీరు విడుదల చేయలేదన్నారు. మాఘ స్నానాలు ఆచరించేందుకు కూడవెల్లికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కల్పించిన పాపత్మాకమైన ప్రభుత్వమని విమర్శించారు. లక్షలాది మంది భక్తులు వచ్చే కూడవెల్లి జాతర ఏర్పాట్ల పర్యవేక్షణకు సీపీ కానీ ఏసీపీ, డీఎస్పీలు రాకపోవడం దురదృష్టకరమన్నారు.

## బీఆర్ఎస్ అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషిచేయాలి

కౌన్సిలర్ చందనారవీందర్‌ను సన్మానిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 29: బీఆర్ఎస్ అభ్యున్నతికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ గంగిశెట్టి చందనారవీందర్ అభినందన సభకు హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మున్సిపాలిటీలో కేసీఆర్ సహకారంతో అభివృద్ధిని చేపట్టుకున్నామని, అన్ని వార్డుల్లో మురుగుకాల్వలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాన్నారు. 11వార్డు పరిధిలో కేసీఆర్, హరీశ్‌రావు సహకారంతో పార్కును తలపించేలా వైకుంఠధామాన్ని పూర్తి చేసుకున్నామన్నారు.

## ఎంపీడీవో ఆఫీస్‌కు జీపీ భవనాన్ని ఇచ్చేది లేదు

గ్రామసభకు హాజరైన గ్రామస్తులు

- ధూళిమిట్ట గ్రామసభలో గ్రామస్తుల నిర్ణయం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 29: ధూళిమిట్ట మండలానికి ప్రభుత్వం నూతన ఎంపీడీవో కార్యాలయాన్ని మంజూరు చేసింది. కార్యాలయ భవనం కోసం గ్రామస్తుల అభిప్రాయ సేకరణను బుధవారం ధూళిమిట్టలో ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో కార్యాలయం కోసం కేటాయించాలనే అధికారుల ఆలోచనపై గ్రామస్తులు విముఖత చూపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో కార్యాలయం కోసం ఎట్టి పరిస్థితిలో ఇవ్వబోమని, ప్రత్యామ్నాయంగా గ్రామంలోని ప్రైవేటు భవనాన్ని ఇవ్వనున్నట్లు గ్రామస్తులు అధికారులకు తేల్చిచెప్పారు. అవసరమైతే గ్రామస్తులమంతా ప్రైవేటు భవనానికి అద్దెను సైతం భరిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సింహాచలం మధుసూదన్, ఎంపీడీవో రామ్మోహన్ మాట్లాడుతూ.. గ్రామస్తుల అభీష్టం మేరకే ఎంపీడీవో కార్యాలయానికి భవనాన్ని ఎంపిక చేస్తామన్నారు. గ్రామసభలో గ్రామస్తులు వెలిబుచ్చిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మావెంకట్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, నాచగోని పద్మాలక్ష్మణ్ గౌడ్, సుద్దాల రేణుకానర్సింహులు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు స్వర్గం లక్ష్మయ్య, మాజీ ఉపసర్పంచ్ పోతరాజుల లింగం, భాస్కర్, ముంగి శ్రీనివాస్, కనకయ్య, అనిల్, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన

రాయపోల్, జనవరి 29: రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని, ముఖ్యంగా ఆటోడ్రైవర్లు జాగ్రతలు పాటించాలని దౌల్తాబాద్ ఎస్ఐ ప్రేమ్‌దీప్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం ఆటో డ్రైవర్లు, యువకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ తన ప్రాణంతో పాటు ఇతరుల ప్రాణాన్ని రక్షించేందుకు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని సూచించారు.

### ఆర్టీవో కార్యాలయంలో ఆరోగ్య శిబిరం

చేర్యాల, జనవరి 29 : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా చేర్యాల పట్టణంలోని ఆర్టీవో కార్యాలయంలో బుధవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్లకు, ఆటో, ట్రాక్టర్, మోటర్ క్యాబ్, స్కూల్ బస్సు డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, పరిమితికి మించి ప్రయాణికులను, సరుకులను వాహనంలో ఎక్కించవద్దని సూచించారు. వాహనదారులు వాహనాలను జాగ్రత్తగా నడుపాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖాన వైద్యులు, వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ వైద్యులు, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ నేహా, జూనియర్ అసిస్టెంట్ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ విక్టోరియా, డ్రైవర్లు పాల్గొన్నారు.

### కొండపాకలో...

కొండపాక(కుకునూరుపల్లి), జనవరి 29: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం కొండపాక మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మైనర్లు వాహనం నడుపవద్దని సూచించారు. వాహనం నడిపే వారందరికీ కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రాయపోల్: ఆటోడ్రైవర్లకు, యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రేమ్‌దీప్, పోలీసు సిబ్బంది

చేర్యాల: ఆరోగ్య శిబిరంలో మాట్లాడుతున్న చేర్యాల మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ క్రిస్టోఫర్

## జంతు సంక్షేమంపై అవగాహన

చేర్యాల, జనవరి 29: చేర్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జంతు సంక్షేమ సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమ పక్షోత్సవాలను పురస్కరించుకొని ఆరోతరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు జంతు సంక్షేమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జంతువుల నుంచి మానవులకు సోకే వ్యాధుల గురించి జంతు సంరక్షణ చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ డాక్టర్ రాజిరెడ్డి, మండల పశువైద్యాధికారి విజయసారథి, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మల్లారెడ్డి

మల్లారెడ్డి

సిద్దిపేట, జనవరి 29: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిద్దిపేట జిల్లా కార్యదర్శిగా ఆముదాల మల్లారెడ్డి ఎన్నికయ్యారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 28 వరకు జరిగిన రాష్ట్ర నాలుగో మహాసభల్లో ఆముదాల మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ప్రజానాట్య మండలి, రైతు సంఘాల్లో వివిధ స్థాయిల్లో పనిచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేస్తూ చేర్యాల సీపీఎం శాఖ కార్యదర్శిగా, మండల కార్యదర్శిగా, చేర్యాల డివిజన్ కార్యదర్శిగా, జనగామ డివిజన్ కార్యదర్శిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా పనిచేశారు. జిల్లాల పునర్విభజన అనంతరం సిద్దిపేట జిల్లా కార్యదర్శిగా 2016 నుంచి మూడు పర్యాయాలు పనిచేస్తున్నారు. 2008లో జరిగిన చేర్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో 2014 జనగామ అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిగా పోటీచేశారు.

## మూఢ నమ్మకాలను నమ్మవద్దు

మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను

కొమురవెల్లి, జనవరి 29: మూఢనమ్మకాలను నమ్మవద్దని చేర్యాల సీఐ శ్రీను అన్నాడు. మంగళవారం రాత్రి గురువన్నపేటలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.. మంత్రాలు, తంత్రాలు ఏమి లేవని, టెక్నాలజీ ఇంతగా అభివృద్ధి చెందుతున్న కాలంలో మూఢనమ్మకాలను నమ్మవద్దన్నారు. గురువన్నపేటలో జరిగిన ఘటన ఆక తాయిలు చేసిన పనిగా ఉందన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు. సైబర్ నేరాలు, సామాజిక రుగ్మతలు, సోషల్ మీడియా ప్రభావం, మహిళా చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, కళాబృందం, సాంస్కృతిక బృందం సభ్యులు పాల్గొన్నారు.

## నేడు చేర్యాలలో మహాధర్నా

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు హాజరుకానున్న అఖిలపక్ష నాయకులు

మహాధర్నా స్థలాన్ని పరిశీలిస్తున్న నర్సయ్య పంతులు

చేర్యాల, జనవరి 29: చేర్యాలలో గురువారం అఖిలపక్షం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నారు. అంగడి బజార్ వద్ద మహాధర్నా జరిగే స్థలాన్ని బుధవారం చేర్యాల రెవెన్యూ డివిజన్ అఖిలపక్ష జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు, అఖిలపక్ష నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా అంబేద్కర్‌కు పూలమాల వేసి పట్టణంలో ర్యాలీగా మహాధర్నా స్థలానికి చేరుకుంటామని తెలిపారు. మహాధర్నాకు మద్దతుగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, టీచర్ ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి, తెలంగాణ తెలుగు యువత అధ్యక్షుడు డాక్టర్ పొగాకు జయరామచంద్రారెడ్డి, అఖిలపక్ష నాయకులు హాజరవుతారని తెలిపారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నుంచి సుమారు 4వేల మంది హాజరవుతున్నట్లు చేర్యాల రెవెన్యూ డివిజన్ అఖిలపక్ష జేఏసీ చైర్మన్ నర్సయ్య పంతులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్ గౌడ్, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజేందర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ మహమ్మారి జోలికి పోవద్దు

మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ మురళి

గజ్వేల్, జనవరి 29: యువత, విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారి జోలికి వెళ్లోద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నికత్ అంజుమ్, ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటు పడితే బయటపడడం కష్టంగా ఉంటుందన్నారు. డ్రగ్స్ శరీర భాగాలను విచ్ఛిన్నం చేస్తుందని, ఆరోగ్యంగా ఉండాలంట